క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి మంత్రి సాయం



నగదు అందజేస్తున్న ఎమ్మెల్సీ

శాంతిపురం: దండికుప్పం అంబేడ్కర్ కాలనీలో నిర్మిస్తున్న గంగమాంబ ఆలయానికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పంపిన రూ.50వేలను ఎమ్మెల్సీ భరత్ గురువారం నిర్వాహకులకు అందజేశారు. మంత్రి పర్యటన సందర్భంగా మహిళలు ఆలయ నిర్మాణానికి సాయం చేయాలని కోరడంతో ఆయన స్పందించారని ఎమ్మెల్సీ చెప్పారు. కార్యక్రమంలో రెస్కో వైస్ చైర్మన్ కోదండరెడ్డి, మాజీ చైర్మన్ చక్రపాణిరెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

విశ్రాంత హెచ్ఎం మృతికి నివాళి

సదుం: మండలంలోని జాంద్రపేటకు చెందిన రిటైర్డ్ హెచ్ఎం సురేంద్ర (62) గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృతదేహానికి తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, మాజీ ఎంపీపీ ఇందిరమ్మ, పెద్దిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, మల్‌రెడ్డి, హరినాథరెడ్డి, శ్రీనివాసులు, కృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎంఆర్‌పీఎస్ నాయకుల పాదయాత్ర



పాదయాత్రలో ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు

సదుం: మందకృష్ణ మాదిగ నిర్వహిస్తున్న పాదయాత్రకు సంఘీభావంగా ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు మండలంలో గురువారం పాదయాత్ర నిర్వహించారు. అమ్మగారిపల్లె నుంచి సదుం వరకు పాదయాత్ర కొనసాగింది. శీతాకాల పార్లమెంటు సమావేశాల్లో వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ నియోజకవర్గ ఇన్‌చార్జి నరసింహులు, మురళి, రామచంద్ర, వెంకటరామయ్య, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్తు చిరుధాన్యాలదే!



రైతులకు సూచనలు చేస్తున్న శాస్త్రవేత్తలు

కుప్పం రూరల్: భవిష్యత్తు చిరుధాన్యాలదేనని ఏరువాక చిత్తూరు కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రెడ్డిరాము, విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ కె.రాఘవేంద్ర పేర్కొన్నారు. గురువారం మండలంలోని జరుగు, గుడ్లనాయనపల్లె, క్రిష్ణాదాసనపల్లెలో రాగి, సామ పంటల దిగుబడిని వారు పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. కుప్పం ప్రాంతంలో చిరుధాన్యాల్లో రాగి, సామ అధికంగా పండిస్తారన్నారు. ఇందులో కొత్త రకాలైన తిరుమల, వకుళ రకాలను సాగు చేస్తే ఎకరాకు మరో 4 క్వింటాళ్ల దిగుబడి ఎక్కువగా వస్తుందన్నారు. ప్రపంచం మొత్తం చిరుధాన్యాలను ఉత్తమమైన ఆహారంగా భావించి భారతదేశం వైపు చూస్తోందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి అమృతవల్లి, విస్తరణాధికారి ఔరంగ్, రైతులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

గంగవరం: పేకాట స్థావరంపై దాడులు చేసి ఏడుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం ఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపిన వివరాలు.. అందిన రహస్య సమాచారం మేరకు ఎస్‌ఐ తన సిబ్బందితో కలిసి మండలంలో తమ్మిరెడ్డిపల్లె సమీపంలోని కౌండిన్యనది ప్రాంతంలో పేకాట స్థావరంపై దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.15వేలు స్వాధీనం చేసుకున్నారు.

ఈరోజు

జగనన్నకు చెబుదాం

సదుం: మండల కేంద్రంలో 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం శుక్రవారం నిర్వహించనున్నట్టు తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీఓ వరప్రసాద్ తెలిపారు. జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా స్థాయి అధికారులు హాజరవుతారని, సమస్యలపై ప్రజలు వినతిపత్రాలు ఇచ్చి పరిష్కరించుకోవచ్చని చెప్పారు.

షాపుల వేలం

పుంగనూరు: మున్సిపాలిటీ పరిధిలో ఉబేదుల్లా కాంపౌండులోని 4, 6, 8 నంబర్ల షాపులను శుక్రవారం ఉదయం 11 గంటలకు వేలం వేయనున్నట్లు కమిషనర్ నరసింహప్రసాద్ తెలిపారు. నిబంధనల మేరకు ధరావత్తు చెల్లించి, వేలంలో పాల్గొనాలని కోరారు. మూడేళ్ల కాల పరిమితితో వీటిని పొందవచ్చన్నారు.

బోయకొండ.. అభివృద్ధే అజెండా

- నేడు మంత్రి పెద్దిరెడ్డి చేతుల మీదుగా పలు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు
- రూ.4 కోట్లతో పలు పనులు పూర్తి
- కమాండ్ కంట్రోల్ వ్యవస్థతో పటిష్ట భద్రత
- మరింత పెరగనున్న భక్తుల సంఖ్య
- నూతన పాలక మండలికి అభినందన సభ



బోయకొండ ఆలయ ముఖచిత్రం

చౌడేపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ బోయకొండ గంగమ్మ ఆలయం వద్ద కోట్లాది రూపాయలతో చేసిన పలు అభివృద్ధి పనులు ప్రారంభోత్సవానికి సిద్ధమయ్యాయి. మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి బోయకొండ ఆలయాభివృద్ధి, భక్తులకు మౌలిక సదుపాయాల కల్పనకు కోట్లాది రూపాయలు మంజూరు చేయించారు. అలాగే పనులను శరవేగంగా పూర్తి చేయించారు. దీంతో బోయకొండ, గంగమ్మ ఆలయం, పరిసర ప్రాంతాలు మరిన్ని సొబగులతో ఆకర్షణీయంగా మారాయి. అభివృద్ధి పనుల మూలాన రాబోవు రోజుల్లో భక్తుల సంఖ్య మరింత పెరుగుతుందనే అధికారులు చెబుతున్నారు. సుమారు రూ.4 కోట్లతో చేసిన వివిధ అభివృద్ధి పనులను మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రారంభించనున్నట్టు ఆలయ చైర్మన్ నాగరాజారెడ్డి తెలిపారు. తొలుత అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి దర్శించుకుని పూర్ణాహుతి కార్యక్రమంలో మంత్రి పాల్గొంటారు.

ప్రారంభోత్సవాలివే..

ఆలయం వద్ద రూ.32 లక్షలతో బలిపీఠం వద్ద నిర్మించిన పెద్ద భోగ మండపం, రూ.45 లక్షలతో నిర్మించిన యాగశాలతో కూడిన ఆశీర్వాద మండపం, రూ.25 లక్షలతో బోయకొండలో 130 సీసీ కెమెరాలతో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూము, సెక్యూరిటీ, పోలీస్ ఔట్ పోస్టు, రూ.75 లక్షలతో నిర్మించిన వాహనాల పార్కింగ్ ప్రాంగణం, రణభేరి గంగమ్మ ఆలయం నుంచి పుష్కరిణి వరకు రూ.54 లక్షలతో ఏర్పాటుచేసిన తొమ్మిది స్వాగత తోరణాలను మంత్రి ప్రారంభిస్తారు. అలాగే రూ.50 లక్షలతో వేసిన సీసీ రోడ్డును ప్రారంభించిన అనంతరం రూ.54 లక్షలతో భవానీ నగర్ వద్ద ముఖద్వార ఆర్చి, రూ.17 లక్షలతో వలసపల్లె వద్ద ముఖద్వార ఆర్చి ఏర్పాటుకు శంకుస్థాపన చేస్తారు. అలాగే, నూతన పాలక మండలికి బోయకొండ గంగాపురంలో అభినందన సభ లో మంత్రి ప్రసంగిస్తారు. ఈ కార్యక్రమాలకు సంబంధించి ఆలయ పాలక మండలి, అధికారులు, ప్రజాప్రతినిధులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, ఈఓ చంద్రమౌళి, సీఐ కృష్ణారెడ్డి పరిశీలించారు.





ప్రారంభోత్సవానికి సిద్ధమైన సెక్యూరిటీ భవనం, పోలీస్ ఔట్ పోస్టు, సీసీ కెమెరాల కేంద్రం, బోయకొండలో నూతనంగా నిర్మించిన ఆశీర్వాద మండపం

ప్రత్యేక అలంకారాల్లో అమ్మవారి దర్శనం



పలమనేరులో..



పుంగనూరులో..



శాంతిపురం: సోగడబళ్ల వద్ద..

పలమనేరు: నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక పాతపేట ఎస్టీకాలనీలో దుర్గమ్మ అన్నపూర్ణదేవీగా, ఎద్దుల సంతవీధిలో ఓంశక్తి మాత గాయత్రిదేవీగా, బసవన్నగుడిలో అమ్మవారు పార్వతిగా, బజారువీధిలోని వెంకటేశ్వరాలయంలో లక్ష్మీనరసింహులుగా, తిరుపతి గంగమ్మ ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణగా, ఆది ఆంధ్రావీధిలో అమ్మవారు రాజరాజేశ్వరిగా, సత్యగంగమ్మ ఆలయంలో లలితామాతగా దర్శనమిచ్చారు. ప్రత్యేక పూజల్లో భక్తులు పాల్గొన్నారు.

భక్తి గీతాలాపన

పట్టణానికి చెందిన వాసవి వనితా క్లబ్ సభ్యురాళ్లు దసతా ఉత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక వాసవి ఆలయంలో కోలాటాలు, భక్తి గాన విభావరి కార్యక్రమాలను నిర్వహించారు. హిందూ ధర్మం గురించి, దసరా ప్రాశస్త్యాన్ని వివరించారు.

గజలక్ష్మి అవతారంలో మలాలమ్మ

గంగవరం: మండలంలోని మేలుమాయి క్రాస్ వద్ద ఉన్న శ్రీమలాలమ్మ ఆలయంలో నవరాత్రి ఉత్సవాల్లో గురువారం అమ్మవారు గజలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శుక్రవారం సంతానలక్ష్మి అవతారంలో దర్శనమిస్తారని ఆలయ ధర్మకర్త చంద్రప్ప తెలిపారు.

మహా చండీదేవిగా దుర్గమ్మ

పెద్దపంజాణి: మండలంలోని శంకర్రాయలపేట దొరచెరువు కట్టపై ఉన్న దుర్గమ్మ ఆలయంలో గురువారం అమ్మవారు శ్రీ మహాచండీదేవి అలంకారంలో భక్తులను కటాక్షించారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

లలితాదేవి అలంకరణలో వాసవీ మాత

బైరెడ్డిపల్లె: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం కన్యకాపరమేశ్వరి ఆలయంలోని అమ్మవారు లలితాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే బాటగంగమ్మ ఆలయం, శ్రీ సల్లాపురెమ్మ ఆలయంలోని అమ్మవారిని అన్నపూర్ణేశ్వరి అలంకరణలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

విజయలక్ష్మీదేవి అలంకరణలో వాసవీమాత

వి.కోట: పట్టణంలోని శ్రీ వాసవీమాత, దుర్గామాత అమ్మవార్లు గురువారం విజయలక్ష్మీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, సాయంత్రం ఉయ్యాలసేవ నిర్వహించారు. వందలాది మంది మహిళాభక్తులు దర్శించుకున్నారు.

పుంగనూరులో..

పుంగనూరు: స్థానిక శ్రీభోగనంజుండేశ్వరస్వామి ఆలయంలో పార్వతీదేవిని మహాచండీదేవి అలంకారంలో పూజలు చేశారు. శ్రీవిరూపాక్షి మారెమ్మను పసుపు, కుంకుమ, గంధంతో అలంకరించారు. నాగపాళ్యంలోని మార్వాడీలు అమ్మవారిని మహాలక్ష్మి అలంకారంలో తీర్చిదిద్ది, కరెన్సీ నోట్ల హారాలతో అలంకరించారు. శ్రీచాముండేశ్వరి ఆలయంలో అమ్మవారిని, వాసవి కన్యకా పరమేశ్వరిదేవిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు.

లలితాదేవిగా ఎల్లమాంబ

శాంతిపురం: సోగడబళ్ల వద్ద ఉన్న శ్రీ ప్రసన్న గురుమూర్తి ఎల్లమాంబ ఆలయంలో అమ్మవారు గురువారం లలితాదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. విశేష అభిషేకం తర్వాత చందనం, పసుపు, కుంకుమలతో అమ్మవారిని అలంకరించారు. మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.




పలమనేరు: భక్తిగీతాలు ఆలపిస్తున్న మహిళలు



వి.కోట : దుర్గామాత ఆలయంలో భక్తుల సందడి







గంగవరం: మేలుమాయిక్రాస్‌లో.., పెద్దపంజాణి: దొరచెరువు కట్టపై.., బైరెడ్డిపల్లెలో..

శతాధిక మాజీ సర్పంచ్‌కు ఎమ్మెల్సీ నివాళి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ భరత్



ఆర్థిక సాయం అందిస్తున్న దుర్గ

రామకుప్పం: బళ్ల మాజీ సర్పంచ్ జోసెఫ్(103) మృతదేహానికి గురువారం ఎమ్మెల్సీ భరత్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన సేవలను స్మరించారు. మృతుడి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సుబ్రమణ్యం, జెడ్పీటీసీ సభ్యుడు నితిన్‌రెడ్డి, మండల వైఎస్ఆర్ సీపీ కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు మురళీకృష్ణ, మురుగేష్ పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

రామకుప్పం: పంచాయతీ కేంద్రమైన పీఎంకే తాండాలో అనారోగ్యంతో మృతి చెందిన ఈశ్వరమ్మ కుటుంబాన్ని ఎమ్మెల్సీ భరత్ సతీమణి దుర్గ పరామర్శించారు. మృతురాలి కుటుంబానికి రూ.10 వేలను అందజేశారు. సర్పంచ్ బావాజీనాయక్, నాగభూషణ్ నాయక్, కేశవరెడ్డి, చంద్రశేఖర్ నాయక్, దేవేంద్రనాయక్ పాల్గొన్నారు.

యామగానిపల్లెలో..

గుడుపల్లె: మండలంలోని యామగానిపల్లెకు చెందిన నారాయణమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. ఇది తెలుసుకున్న ఎమ్మెల్సీ భరత్ గురువారం మృతురాలి కుటుంబాన్ని పరామర్శించారు. అంత్యక్రియల నిమిత్తం రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాసులు, ఎంపీటీసీ ఈశ్వర్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తుసామగ్రి

పలమనేరు: మండలంలోని మండిపేట కోటూరు క్లస్టర్‌లోని 18 అంగన్‌వాడీ కేంద్రాలకు అవసరమైన స్టౌలు, కుక్కర్లు, గ్లాసులు, జాతీయ నాయకుల చిత్రపటాలను గురువారం పట్టణానికి చెందిన సామాజిక సేవకులు శ్రీపురం సీతారామయ్య మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ బాలాజీనాయుడుతో కలసి పంపిణీ చేశారు. సీడీపీఓ ఇందిరా ప్రియదర్శిని, సూపర్‌వైజర్ ద్రాక్షాయణి, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ సెంటర్లకు వస్తుసామగ్రి అందజేస్తున్న సీతారామయ్య

ప్రజల వద్దకే వైద్య సేవలు







కుప్పం : ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ సుధీర్, రోగులకు వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్, శాంతిపురం : రోగులకు ఆరోగ్య సురక్ష కిట్లను ఇస్తున్న ఎమ్మెల్సీ భరత్, నాయకులు, అధికారులు

- కుప్పంలో 568 మందికి వైద్య పరీక్షలు

కుప్పం: కుప్పం మున్సిపల్ పరిధిలోని 3, 25 వార్డులు, మండలంలోని చెక్కనత్తం పంచాయతీలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు మంచి స్పందన లభించింది. బాబునగర్, లక్ష్మీపురంలో నిర్వహించిన శిబిరాలను మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్ ప్రారంభించి మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇచ్చారన్నారు. ఈ దిశగా ప్రజలకు ముంగిటకే వైద్య శిబిరాలతో అందుతున్న సేవలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. ఇక్కడ శిబిరాల్లో వైద్య పరీక్షలకు వచ్చిన జగనమే దీనికి ఉదాహరణ అని అన్నారు. అనంతరం రోగులకు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డులకు పంపిణీ చేశారు. అర్బన్‌లో 248 మంది, చెక్కనత్తం పంచాయతీలో 320 మందికి వైద్యపరీక్షలు చేశారు. వీరిలో అధికులు కళ్లకలకతో బాధపడుతున్నవారే ఎక్కువగా ఉండడంతో వారికి ఐ డ్రాప్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్లు, వైద్యులు దిలీప్ కుమార్, జశ్వంత్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దండికుప్పంలో 262 మందికి..

శాంతిపురం: మండలంలోని దండికుప్పంలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో మొత్తం 262 మందిని పీహెచ్‌సీ వైద్యులతోపాటు కుప్పం పీఈఎస్ ఆస్పత్రికి చెందిన స్పెషలిస్టులు పరీక్షించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులతో కూడిన కిట్లను పంపిణీ చేశారు. ఎమ్మెల్సీ భరత్, జెడ్పీటీసీ శ్రీనివాసులు, రెస్కో వైస్ చైర్మన్ కోదండరెడ్డి, మాజీ చైర్మన్ చక్రపాణిరెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ హరినాథరెడ్డి శిబిరంలో అందుతున్న సేవలను పరిశీలించారు. డాక్టర్లు వంశీకృష్ణ, ప్రసాద్, ప్రదీప్, సలీం, ఉషారాణి సేవలు అందించారు.

పలమనేరు నియోజకవర్గం

చప్పిడిపల్లెలో 268 మందికి..

బైరెడ్డిపల్లె: మండలంలోని చప్పిడిపల్లెలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో 268 మందికి వైద్యాధికారులు అరుణ్‌కుమార్, విజయ్‌కాంత్, సుమలత, శాలిని, సౌజన్య తమ సిబ్బందితో వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప, జెడ్పీటీసీ సభ్యుడు ఆర్.కేశవులు, సర్పంచ్ విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

శంకర్రాయలపేటలో 236 మందికి..

పెద్దపంజాణి: మండలంలోని శంకర్రాయలపేట జెడ్పీ హైస్కూల్లో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్యాధికారులు కావ్యమిట్ట, శ్రీమీను, మురళీకృష్ణ, నందిని మొత్తం 236 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. మెరుగైన చికిత్స నిమిత్తం ఇద్దరిని ఆరోగ్యశ్రీకి రెఫర్ చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రజలకు అవగాహన నిమిత్తం ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాళ్లను ప్రజాప్రతినిధులు, అధికారులు పరిశీలించారు. సర్పంచ్ హరినాథ్, వైస్ ఎంపీపీ జీడీ బాబు, ఎంపీడీఓ అబ్దుల్ రహీం, తహసీల్దార్ లోకేశ్వరరావు, ఎంఈఓ తులసీరాం, ఈఓపీఆర్‌ఆర్డీ శారదాదేవి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శారద, పీఎస్ పవన్‌కుమార్, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి తమ్మిరెడ్డి, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు శంకరప్ప, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పుంగనూరు నియోజకవర్గం

మిట్టచింతవారిపల్లెలో 251మందికి..

పుంగనూరు: మండలంలోని మిట్టచింతవారిపల్లెలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో డాక్టర్ సల్మా ఆధ్వర్యంలో డాక్టర్లు వసుధ, నీరజ, సృజన, తేజస్విని, కిరణ్మయి తమ సిబ్బందితో మొత్తం 251 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఇందులో 12 మంది ఆర్థో సమస్యలు, మరో 25మంది దృష్టి సమస్యలతో బాధపడుతున్నట్లు గుర్తించారు. అలాగే ఒకరికి కుష్ఠువ్యాధి లక్షణాలను గుర్తించారు.

పరికిదొనలో 284 మందికి..

చౌడేపల్లె: మండలంలోని పరికిదొనలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో 284 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. గైనకాలజిస్ట్ డాక్టర్ అనురాధ, ఈఎన్‌టీ స్పెషలిస్ట్ మనీష్, డాక్టర్లు పూజ, ప్రవీణ్ తమ సిబ్బందితో రోగులకు సేవలందించారు.అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాళ్లను ఎంపీపీ రామమూర్తి, జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు పరిశీలించారు. అలాగే జగనన్న కంటి వెలుగు కార్యక్రమంలో కళ్ల పరీక్షలు చేసుకున్న వారికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. సర్పంచ్ లక్ష్మీదేవి, ఎంపీటీసీ శ్రీరాములు, ఎంపీడీఓ సుధాకర్ పాల్గొన్నారు.







బైరెడ్డిపల్లె: చప్పిడిపల్లెలో.., పెద్దపంజాణి : రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి మురళీకృష్ణ, చౌడేపల్లె: పరికిదొనలో కళ్లద్దాలను పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

మౌలిక వసతుల కల్పనకు రూ.20కోట్లు: చైర్మన్



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ అలీమ్ బాషా, పక్కన కమిషనర్ నరసింహప్రసాద్

పుంగనూరు: మున్సిపాలిటీలోని 31 వార్డుల్లో మౌలిక వసతుల కల్పనకు రూ.20 కోట్లు మంజూరైందని, దీనిని వ్యయం చేసేందుకు అజెండా ఆమోదించినట్లు మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా తెలిపారు. గురువారం కమిషనర్ నరసింహప్రసాద్ ఆధ్వర్యంలో మున్సిపల్ సమావేశం నిర్వహించారు. చైర్మన్ మాట్లాడుతూ, పుంగనూరు అభివృద్ధికి మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి రూ.20 కోట్లు మంజూరు చేయించారని కృతజ్ఞతలు తెలిపారు. పట్టణంలో అవసరమైన ప్రాంతాలలో కాలువలు, రోడ్లు ఏర్పాటు చేస్తామని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. పట్టణంలో ఎంబీటీ రోడ్డును రూ.52 కోట్లతో విస్తరిస్తున్నట్టు చెప్పారు. అలాగే రూ.22 కోట్లతో కౌండిన్యనదిలో సిమెంటు కాలువలు, రూ.3 కోట్లతో పుంగమ్మ చెరువు కట్టపై పార్కు నిర్మిస్తామన్నారు. పలు సమస్యలపై సభ్యులు చర్చించారు. సమావేశంలో వైస్ చైర్మన్లు నాగేంద్ర, లలిత, సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

భూ పంపిణీ రికార్డులు సిద్ధం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ అమరనాథ్

రొంపిచెర్ల: భూ పంపిణీ రికార్డులు సిద్ధం చేయాలని తహసీల్దార్ అమరనాథ్ ఆదేశించారు. గురువారం ఆయన తన కార్యాలయంలో వీఆర్వోలు, సర్వేయర్లకు సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వ లక్ష్యాల మేరకు అందరూ సమర్థవంతంగా పనిచేయాలన్నారు. భూ పంపిణీ విషయంలో అనర్హులకు తావిచ్చినట్లు దృష్టికి వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో డీటీలు లోకేష్, వెంకటరమణారెడ్డి, ఏఎస్ఓ రాజేశ్వరి, వీఆర్వోలు పల్లవి, శ్రీనివాసులు, మహేష్, రెడ్డిప్రసాద్, వెంకటరమణ, సురేంద్ర, మండల సర్వేయర్ వెంకటరమణ, సచివాలయ సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.